క్లుప్తంగా

అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరులో ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన 117 అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ ఈవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ లేఅవుట్ల వల్ల కొనుగోలు దారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, అధికారుల దృష్టికి సమస్యను తీసుకువచ్చినా వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. తాను సాయిశ్రీ నగర్‌లో స్థలం కొనుగోలు చేశానని నిబంధనల ప్రకారం 2.25 ఎకరాలు సామాజిక అవసరాల కోసం కేటాయించాల్సి ఉండగా కేవలం 72సెంట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఆస్థలాన్ని కూడా నిర్వాహకులు లేఅవుట్లు వేసి అమ్మారన్నారు. పలు అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొని 2285 మంది నష్టపోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం: దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. పట్టణంలోని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలతో శుక్రవారం ఆర్టీఓ తన చాంబర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. దసరా పండుగ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి స్థానికులు, బంధువులు ప్రొద్దుటూరుకు వస్తారని, పండుగ సాకుతో ప్రజల నుంచి అధిక చార్జీలు వసూలు చేయరాదని ఆర్టీఓ చెప్పారు. ప్రతి రోజు తనిఖీలు నిర్వహిస్తుంటామని, ఫిర్యాదులొస్తే ఆయా ట్రావెల్స్ యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఎంవీఐలు నారాయణనాయక్, రవీంద్ర నాయక్, హేమకుమార్, ఏఓ కరిముల్లా, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దసరా ఎగ్జిబిషన్ ప్రారంభం


ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో శుక్రవారం వాసవీ ట్రేడ్‌ఫేర్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. అదే విధంగా ఓంశాంతి వారు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు సీఎం సురేష్‌నాయుడు, ముక్తియార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, సీనియర్ నాయకుడు ఈవీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాపాడు తహసీల్దారుగా రమాకుమారి



చాపాడు: మండల నూతన తహసీల్దారుగా టి.రమాకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న రవీంద్రారెడ్డి కలసపాడుకు బదిలీ అయ్యారు. ఆమె మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇదే క్రమంలో డిప్యూటీ తహసీల్దారుగా కృష్ణారెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దారుగా నారాయణస్వామి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఉన్న డీటీ యామిని ఎర్రగుంట్లకు, రీ సర్వే డీటీ మైదుకూరుకు బదిలీపై వెళ్లారు.

ఖాజీపేట ఏపీఎంగా శైలజా



కొత్త ఏపీఎం శైలజను సత్కరిస్తున్న సిబ్బంది

ఖాజీపేట: ఖాజీపేట ఏపీఎంగా శైలజా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను స్థానిక సిబ్బంది సత్కరించారు. ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళల సమస్యల పరిస్కారం కోసం తన వంతు కృషి చేసి మరింత వృద్ధి చేస్తానన్నారు.

అనుమతి లేనివి అమ్మితే చర్యలు

మైదుకూరు: మండలంలోని ఎరువులు, పురుగు మందుల షాపులను శుక్రవారం ఏడీఏ కృష్ణమూర్తి, ఏఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. యూరియా ధరలను ఎమ్మార్పీ రేట్లకే విక్రయించాలని దుకాణాల యజమానులకు తెలిపారు. అనుమతిలేని పురుగు మందులను అమ్మితే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. క్యూ ఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ఒరిజినల్ లా లేదా డూప్లికేట్ నా అని పురుగు మందులను రైతులు నిర్ధారించుకోవాలని తెలిపారు.

ఫ్రీహోల్డ్ భూముల్లో అవకతవకలు

కడప సెవెన్‌రోడ్స్ : మైదుకూరు మండలంలో ఫ్రీహోల్డ్ భూములపై జరిగిన అవకతవకలపై ఓ తహసీల్దార్‌తోపాటు 14 మంది వీఆర్వోలకు నోటీసులు జారీ చేసి సంజాయిషీ సమర్పించాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మండలంలో ఫ్రీహోల్డ్ భూములపై వచ్చిన ఆరోపణల మేరకు రీ ఎంక్వయిరీ చేసి అక్కడ అవకతవకలు/ తప్పులు జరిగినట్లు గుర్తించామన్నారు. దీంతో ఆ సమయంలో అక్కడ పనిచేసిన ఒక తహశీల్దార్, 14 మంది వీఆర్వోలపై క్రమశిక్షణా చర్యలు తీసుకొనుటకుగాను నిర్ణయించి వారి నుండి వివరణ సమర్పించాలని ఉత్తర్వులు జారీచేశామన్నారు. వారి నుండి సంజాయిషీలనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గురుదేవుళ్లకు వందనం

అన్నింటి కంటే ఉపాధ్యాయ ఉద్యోగం ప్రత్యేకం. పిల్లలను భావి పౌరులుగా ఉన్నతంగా తీర్చిదిద్దగలిగే శక్తి ఒక్క టీచర్‌కే ఉంటుంది. కొందరు గురువులు నిబద్ధతతో తమ వృత్తికే వన్నె తెస్తున్నారు. వారు చేస్తున్న కృషికి పలు అవార్డులు వరించాయి. ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నేడు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నేపథ్యంలో సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. – కడప ఎడ్యుకేషన్

ఆరేళ్ల సర్వీసులో ఒక్క సెలవు పెట్టకుండా..



హెచ్‌ఎం నాగమణి

ఆరు సంవత్సరాలలో ఒక్క సెలవు కూడా పెట్టకుండా విద్యాబోధనలో నిమగ్నమవడం అంటే అస్సలు ఊహించలేం కదా.. ఆ ఊహను నిజం చేసి చూపించారు కడప నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ హెచ్‌ఎం నాగమణి. అంకిత భావానికి నిదర్శనంగా నిలిచిన ఆమె తాను చదివిన పాఠశాలకే హెచ్‌ఎం కావడం మరో విశేషం.

- నాగమణి కడప నగరంలో 8, 9, 10వ తరగతులను నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో చదువుకుంది. తరువాత ఇంటర్‌ను కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుకుంది. డిగ్రీ, పీజీలను ఓపెన్‌లో పూర్తి చేసింది. 2002లో ఉపాధ్యాయ ఉద్యోగం పొంది కడప నగరంలోని 16వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా చేరింది. తరువాత 2012లో పదోన్నతిపై సోషియల్ సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్‌గా గాంధీ నగర్ ఉన్నత పాఠశాలకు వచ్చింది. ఆ తరువాత 2017లో పదోన్నతిపై ప్రధానోపాధ్యాయురాలిగా మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌కు వచ్చింది. ప్రస్తుతం ఆ స్కూల్లో దాదాపు 1400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

బోధన.. సామాజిక సేవ..



సాధించిన అవార్డులు, ప్రశంసాపత్రాలతో మునీమ్

మహమ్మద్ మునీమ్. ఈయన చింతకొమ్మదిన్నె మండలం ఉర్దూ జెడ్పీ హైస్కూల్ బయలాజికల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈయన తరగతి గదికే పరిమితం కాకుండా వివిధ సామాజిక, సాహిత్య, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. తాను పనిచేసే పాఠశాలలో సొంత నిధులతో విద్యార్థులకు విద్యా సామాగ్రిని సమకూర్చడం, దుస్తులను పంపిణీ చేయడం, భాషాభివృద్ధికి తోడ్పాటు అందించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా స్వాతంత్ర సమరయోధుల జయంతి, వర్ధంతులను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ.. విద్యార్థులలో వారిపై అవగాహన పెరిగేలా వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి ప్రతిభచాటిన వారికి బహుతులను అందచేస్తూ ప్రోత్సహిస్తున్నారు. కవుల జన్మదినాలను పురస్కరించుకుని కవితాగోష్టి నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా వైద్య శిబిరాలను, దంత వైద్య శిబిరాలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నాడు ముగ్గురు.. నేడు 103 మంది..



విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచిన వివిధ రకాల పుస్తకాలు



పిల్లలకు నైట్ ట్యూషన్ చెబుతున్న గానుగపెంట రమణారెడ్డి

కాశినాయన మండలం పిట్టిగుంట మండల ప్రాథమికోన్నత పాఠశాలలో 2017లో కేవలం ముగ్గురే ముగ్గురు పిల్లలు ఉండేవారు. ప్రస్తుతం 103 మంది విద్యార్థులున్నారు. ఇదంతా ఆ పాఠశాలలో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న గానుగపెంట రమణారెడ్డి విశేష కృషి. చక్కటి విద్యా బోధనతో పిల్లలను ఆకట్టుకున్నారు. సొంత డబ్బు రూ. 3 లక్షలు వెచ్చించి లైబ్రరీ బుక్స్, గణితం, ఇంగ్లీష్, సైన్స్, తెలుగు పుస్తకాలు, ప్రొజెక్టర్, లాప్‌టాప్, స్మార్ట్ టీవీలు, ఆట వస్తువులు.. ఇలా రకరకాల బోధనోపకరణాలు ఏర్పాటు చేశారు. డైలీ పరీక్షల నిర్వహణకు ప్రింటర్, ఆన్‌లైన్ క్లాసుల కోసం 2018లోనే స్మార్ట్ టీవీని కొనుగోలు చేశారు.

- విద్యార్థులకు ముఖ్యమైన సబ్జెక్టులైన గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించడానికి సొంతంగా ముగ్గురు వాలంటీర్లను ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి నెలకు రూ. 5 వేల చొప్పున చెల్లిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.
- ప్రతి ఏడాది సొంత డబ్బు వెచ్చించి వేసవిలో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇంగ్లీష్ నిపుణులతో సబ్జెక్టు బోధిస్తున్నారు.
- ఇప్పటికీ చదువులో వెనుకబడిన వారికి ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. ఈయన సేవలకు 2015లో ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2022లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది.

ఎంతో సంతృప్తి



నన్ను నమ్ముకుని పాఠశాలకు వచ్చే పేద పిల్లలకు విజ్ఞానాన్ని అందజేయడమే లక్ష్యం. ఆరేళ్ల నుంచి సొంత నిధులతో ముగ్గురు వాలంటీర్లను పెట్టి బోధన సాగిస్తున్నా. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు మా పిల్లలకు ఉచితంగా బోధన చేస్తున్నా. సొంత డబ్బుతో పాటు దాతల సాయంతో బడికి కావాల్సిన సామగ్రి, పుస్తకాలు కొని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నా. చాలా సంతృప్తిగా ఉంది.

– గానుగపెంట రమణారెడ్డి, సోషియల్ టీచర్, పిట్టిగుంట, కాశినాయన మండలం

గణితం.. చాలా సులభంగా..



పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన మ్యాథ్స్ నమూనాలు

మైనపురెడ్డి నాగలక్ష్మీదేవి గణిత ఉపాధ్యాయురాలు. ఈమె ఎక్కడ పనిచేసినా ప్రత్యేక బోధనతో విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. గణితం అంటే పిల్లలలో భయం పోగొట్టి ఇష్టం పెంచేలా తర్ఫీదు ఇస్తున్నారు. వారికి సులభంగా అర్థమయ్యేలా చదువు చెబుతున్నారు. ఈమె చాపాడు మండలం మొర్రాయపల్లె ప్రాథమిక పాఠశాలలలో గతంలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసేవారు. ప్రస్తుతం మైదుకూరు మండలంలోని సుంకులుగారిపల్లెలోని ఎంపీయూపీ స్కూల్‌లో పనిచేస్తున్నారు. మొర్రాయిపల్లెలో పనిచేసే సమయంలో నాడు-నేడు పనుల్లో భాగంగా చేపట్టిన పనులలో పాఠశాల ఇనుప కటాంజనాలలో అబాకస్, భిన్నాలు, ఆరోహణ, అవరోహణ క్రమాలను అమర్చేలా చేసింది. అలాగే ఫ్లోరింగ్, చెట్ల పాదులకు గణిత ఆకారాలను అమర్చేలా పనులు చేయించారు. వీటితో పాటు రోజూ బోధనలో సులభంగా మ్యాథ్ సబ్జెక్టు పట్ల పిల్లలలో ఆసక్తిని పెంచారు.

- నూతన బోధన పద్ధతులపై 2022-23లో జాతీయస్థాయిలో నిర్వహించిన ఇన్నోవేటివ్ పెడగాజి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి మొరాయిపల్లె ప్రాథమిక పాఠశాల అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకుంది. విద్యా అమృత్ మహోత్సవ్ 2022-23లో భాగంగా విద్యా మంత్రిత్వశాఖ, కేంద్ర సీఐఈటీ, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా ఇన్నోవేటివ్ పెడగాజి అంశంపై పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మైనపురెడ్డి నాగలక్ష్మీదేవి రూపొందించిన ప్రాజెక్టు జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది.



మొర్రాయిపల్లె పాఠశాల కటాంజనానికి ఏర్పాటు చేసిన అబాకస్

కష్టమైన సబ్జెక్టును ఇష్టంగా..



నేను పాఠశాలలో జరిగిన నాడు- నేడు పనులలో పిల్లల బోధనకు అనుకూలంగా మ్యాథ్స్‌కు సంబంధించిన నమూనాలను రూపొందించాను. వాటితో పాటు పిల్లలకు మ్యాథ్స్ సబ్జెక్టు అంటే భయం పోగొట్టేలా సులభ పద్ధతులు బోధన చేశాను. నాకు చాలా సంతృప్తిగా ఉంది.

– మైనపురెడ్డి నాగలక్ష్మీదేవి, ఉపాధ్యాయురాలు

ఘన నివాళి



గురివిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్యం

దువ్వూరు: మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన గోపిరెడ్డి చిన్న గురివిరెడ్డి(70) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం గురివిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. ఈయన తో పాటు దువ్వూరు సింగిల్ విండో మాజీ చైర్మన్ మస్తాన్‌రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు.

దోమల నివారణకు చర్యలు



నీటి కుంటలో గంబూసియా చేపలను వదిలేందుకు వెళ్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

బద్వేలు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణ చర్యల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు మంచినీటి కుంటల్లో లక్ష గంబూసియా చేపలు వదిలారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులకు కారణమైన దోమలను అరికట్టేందుకు ప్రతిఒక్కరు దోమల నివారణ చర్యలు పాటించాలని కోరారు. ప్రజలు కూడా బాధ్యతగా వారంలో ఒక రోజు డ్రైడే పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

- ఇంటి, నీటి పన్నుల వసూలు విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో ఆయా సచివాలయాల పరిపాలన కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు లేని ఇళ్లను, ఖాళీ జాగాలను గుర్తించి పన్నులు వేయాలని కోరారు. పన్నుల వసూలులో పురోగతి లేని 6 మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు అందజేశారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



పోరుమామిళ్ల: పురుగుమందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కలసపాడు: మండల కేంద్రమైన కలసపాడులోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు తనిఖీ చేసి సక్రమంగా ఉంచుకోవాలని దుకాణ యజమానులకు సూచించారు. వరిపంటలో సుడిదోమ, ఆకుముడత తెగుళ్ల నివారణ మందులు అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తెచ్చుకోవాలన్నారు. నిషేధించబడిన కలుపు మందులు నిల్వ ఉంచడం, అమ్మకం జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుకాణాల తనిఖీ

పోరుమామిళ్ల: పట్టణంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలు వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డితో పాటు పోరుమామిళ్ల, కలసపాడు, బి. మఠం మండలాల వ్యవసాయాధికారులు ఈ తనిఖీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, నాణ్యమైన పురుగు మందులు విక్రయించాలని, ఎమ్మార్పీ ధరకే అమ్మాలని చెప్పారు. అనుమతి లేకుండా బయో పురుగుమందులు అమ్మరాదని హెచ్చరించారు.

ఆకస్మిక తనిఖీ

అట్లూరు: బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల్లోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు నిల్వలు, రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను పరిశీలించి ఇన్వాయిస్, వేబిల్స్, లైసెన్స్ వ్యాలిడిటీ, ధరల పట్టిక తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని, గడువు ముగిసిన వాటిని విక్రయించవద్దని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయమానంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

బద్వేలు అర్బన్: పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. రెండవ రోజైన శుక్రవారం కూడా వివిధ ఆలయాలలో అమ్మవారి అలంకారాలు తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకారంలో దర్శనమివ్వగా మహాలక్ష్మి ఆలయంలో ధనలక్ష్మిదేవి అలంకారంలో, వీరభద్రస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అలాగే కోదండరామాలయంలో కూర్మావతారం అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీలు చర్యలు చేపట్టారు. ఆయా ఆలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు

కలసపాడు: స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉభయ దాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్, కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఎం.నాగరాజ, జె.నారాయణ, జయకృష్ణ పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి దేవస్థానంలో శుక్రవారం వాసవీమాత గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి త్రివిక్రమ అలంకారంలో దర్శనమిచ్చారు.

రాహుకాల పూజ: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో శుక్రవారం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో రాహుకాల దీప పూజ నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో వాసవీ మాత ఆలయంలో రాహుకాల పూజ నిర్వహించడం వలన ప్రజలకు మేలు జరుగుతుందనే నమ్మకంతో 108 మంది మహిళలతో ఈ పూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



బద్వేలు అర్బన్ : అమ్మవారిశాలలో దుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



మైదుకూరు భీమేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవి



రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో భవాని దేవి

గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

కాశినాయన: మండల కేంద్రమైన నరసాపురంలో దసరా పండుగను పురస్కరించుకుని శుక్రవారం గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కాయకర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గాయత్రి దేవిగా అమ్మవారు

మైదుకూరు: మైదుకూరులో దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారిశాలలో, భీమేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



మైదుకూరు అమ్మవారిశాలలో గాయత్రీదేవి



కాశినాయన : గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు



కలసపాడు: పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు



పోరుమామిళ్ల: గాయత్రీ దేవి అలంకారంలో వాసవీమాత

ఆలయాభివృద్ధికి కృషి చేస్తా



అమృతేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ

ప్రొద్దుటూరు కల్చరల్: అమృతేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ నూతన అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయంలో శుక్రవారం ఆలయ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఆలయ అధ్యక్షుడిగా కొవ్వూరు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నామా రమేష్‌బాబు, కోశాధికారిగా బొగ్గరపు కిరణ్‌కుమార్, సహాయ కోశాధికారిగా సూకల శ్రీధర్, కార్యదర్శిగా నామా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా శివపురం కళాసాగర్, వల్లంకొండు రఘువంశీ, పీఆర్‌ఓగా ధారా సంతోష్, సభ్యులుగా వల్లంకొండు మనోహర్, తల్లం కిశోర్, మేడా మధుసూదన్ ప్రమాణ స్వీకారం చేశారు.

ఏఓకు ఘన వీడ్కోలు

మైదుకూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.లక్ష్మీదేవికి బదిలీ సందర్భంగా శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె సిద్ధవటం మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ నాయుడు, ఏఓ నాగేంద్రబాబు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీదేవిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

ఎంపీడీఓగా సూర్యనారాయణరెడ్డి



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు ఎంపీడీఓగా సానేపల్లి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామాపురం మండలం నుంచి ఈయన బదిలీపై రాగా, ఇక్కడ పనిచేస్తున్న కుళ్లాయమ్మను వేంపల్లెకు బదిలీ చేశారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణరెడ్డికి కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఖాజీపేట ఎంపీడీఓగా దివిజా సంపతి



ఖాజీపేట: ఖాజీపేట ఎంపీడీఓగా దివిజా సంపతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఖాజీపేటలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా వెంకటరమణ ఉన్నారు. దివిజా సంపతి వేంపల్లె ఎంపీడీఓగా పనిచేస్తు ఇక్కడికి వచ్చారు.

ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ నాయుడు



మైదుకూరు: మైదుకూరు ఎంపీడీఓగా కేవీ శ్రీధర్ నాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చాపాడు ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన మైదుకూరుకు బదిలీ అయ్యారు. మైదుకూరు ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న ఏఓ లక్ష్మీదేవి ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లారు. శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల సహకారంతో మైదుకూరు మండలాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపిస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పోరుమామిళ్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పోరుమామిళ్ల అటవీశాఖాధికారి రఘునాథరెడ్డి అన్నారు. రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రేంజ్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలు, చెత్త తొలగించి, శుభ్రం చేశారు. అనంతరం రఘునాథరెడ్డి మొక్కలు నాటారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా దమ్మన్నపల్లె సచివాలయంలో సర్పంచ్ సురేష్ అధ్యక్షతన గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి పర్యావరణం, మొక్కల పెంపకం, వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కల్పించారు. సచివాలయ ఆవరణలో 35 మొక్కలు నాటారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ మార్కారెడ్డి

పోరుమామిళ్ల: విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగి ఉంటేనే తదుపరి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమని పీఆర్ ఆర్‌డీ మాజీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకృష్ణ శారద డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలనే లక్ష్యంతో 1972లో దేశాయి మార్కారెడ్డి, శేషారెడ్డి స్మారక జూనియర్ కళాశాల స్థాపించామన్నారు. 1978లో కళాశాల ప్రభుత్వంలో విలీనం అయ్యాక 1992లో కృష్ణ శారద జూనియర్ కళాశాల, 1994లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మార్కారెడ్డి, ప్రిన్సిపాల్ జయప్రద పాల్గొని.. సెమిస్టర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.